క్లుప్తంగా

రీసర్వేతో భూ వివాదాలకు చెక్

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల ఉపయోగం కోసం జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం తీసుకువచ్చిందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం బస్తిపాడు గ్రామంలో టెంకాయ కొట్టి భూరీ సర్వేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రైతుల అభ్యున్నతికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే ఎరువులు, మందులను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగేశ్వరరావు, వీఆర్వో భాజన్న, నాయకులు చింతారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కౌలు కార్డు మంజూరుపై సీఈఓ విచారణ

కోడుమూరు: మండలంలోని ప్యాలకుర్తిలో భూమి యజమానికి తెలియకుండా మద్దిలేటి అనే వ్యక్తికి కౌలు కార్డు మంజూరు చేసిన విషయంపై శుక్రవారం జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి గ్రామంలో విచారణ జరిపారు. వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఫీల్డ్‌కు వెళ్లి పరిశీలించి సంబంధిత రైతుకు కౌలు కార్డు మంజూరు చేయాల్సి ఉందని, అయితే వీరిద్దరు నిబంధనలు పాటించకుండా, భూ యజమానికి తెలియకుండా కౌలు కార్డు మంజూరు చేశారని విచారణలో తెలిసింది. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు సీఈఓ నాసరరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ హరిప్రసాద్, ఏఓ రవిప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

రీసర్వే సకాలంలో పూర్తి చేయాలి

- డీఆర్ఓ మధుసూదన్‌రావు



రీసర్వే వివరాలపై ఆరా తీస్తున్న డీఆర్ఓ మధు సూధన్‌రావు

కల్లూరు: ప్రభుత్వం రైతులు ఉపయోగార్థం జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం తీసుకువచ్చిందని, గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలని డీఆర్ఓ కె. మధు సూదన్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ రీసర్వేతో రైతులకు ఎంతో ఉపయోగం ఉందన్నారు. మండలంలో ఎన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, ఏ గ్రామంలోనైనా రైతుల మధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయా అని తహసీల్దార్ రవేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. రైతుల మధ్య ఎలాంటి భూ సమస్యలు ఉండకూడదనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లోని రైతులకు వివరించాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతలను సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. గ్రామానికి చెందిన జంగటి లక్ష్మీదేవి (40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత నెల 29న గని గ్రామానికి పత్తి పంటలో కలుపుతీయడానికి కూలీకి వెళ్లింది. పని చేస్తుండగా పాముకాటుకు గురైంది. చుట్టు పక్కల కూలీలు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందినట్లు భర్త గోపాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని తిప్పాయపల్లె గ్రామానికి చెందిన గొల్ల స్వామన్న(72), అయాసం, కడుపు నొప్పి బాధ భరించలేక ఈ నెల 2న ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం

పాణ్యం: గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తామని కొండజుటూరు గ్రామ సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అనంతరం ప్రజలు సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డిని సన్మానించారు. ఇటీవల ప్రధాన మంత్రి పిలుపు మేరకు స్వచ్ఛతేహా సేవా కార్యక్రమంలో భాగంగా ఉదయాన్నే కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ చేసి, ప్రజలకు అవగాహన కల్పించి త్వరగా అప్‌లోడ్ చేయగా నంద్యాల జిల్లాలోనే కొండజుటూరు గ్రామ పంచాయితీ మొదటి స్థానంలో నిలిచి స్వచ్ఛతేహా సేవా అవార్డు వచ్చింది. ఇందుకు కృషి చేసిన సర్పంచ్, జెడ్పీటీసీ సభ్యులు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, రచనారెడ్డిని ప్రజలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత

- పేదల ఆరోగ్యానికి భరోసా..జగనన్న సురక్ష
- హెల్త్ క్యాంపును పరిశీలించిన కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ఆరోగ్య సురక్షలో భాగంగా మెడికల్ రిపోర్టును మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: వైద్య రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మారుమూల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. శుక్రవారం కోడుమూరులోని కొండపేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే డా.సుధాకర్ సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారన్నారు. ప్రజలంతా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని వైద్యసేవలు పొందాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ శరభయ్య, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జి లాయర్ ప్రభాకర్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బలరాం, అయ్యప్ప, ఐసీడీఎస్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

కోడుమూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపునకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. తరలివచ్చిన జనంతో హెల్త్ క్యాంప్ కిటకిటలాడింది. హెల్త్ క్యాంప్‌లో 350మందికిపైగా వైద్య సేవలు పొందారు. డాక్టర్లు జయంతి,నస్రీన్, మధన్ ప్రజలకు బీపీ, షుగర్, గుండె, కంటి తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరంమేరకుఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సురక్షతో పేదలకు ఆరోగ్య భద్రత

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఆరోగ్య భద్రత కలుగుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాప్‌ను మండల అధికారులు, వైద్యులు నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కేస్‌షీట్ల రిజిస్ట్రేషన్, ఓపీల జారీ, కంటి పరీక్షలను పరిశీలించిన ఎమ్మెల్యే వైద్యులకు, అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా డాక్టర్ల సిఫార్సుల మేరకు అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను, మందులను డాక్టర్లు, మండల అధికారులు, ప్రజా ప్రతనిధులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, డాక్టర్లు సునిత, శ్రావణి, కేధార్‌నాథ్‌గౌడ్, రోహిత్‌రాఘవేంద్ర, కంటి వ్యాధి నిపుణుడు సంపత్, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, నాయకులు ప్రకాష్‌ఆచారి, రఘురెడ్డి, ప్రతాప్, బసయ్య, సూర్యచంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంప్‌లో వృద్ధురాలి కేస్‌షీట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష

ఓర్వకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందని ఎంపీడీఓ శివనాగప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని శకునాల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుకు విశేష స్పందన లభించింది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పలు రకాల జబ్బులకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు సాధారణ వ్యాధులతో పాటు, ఉబ్బసం, క్షయ, మలేరియా, టైఫాయిడ్, బీపీ, సుగర్ వ్యాధి నిర్ధాణ పరీక్షలు చేశారు. అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ సూచించారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం కింద కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు పి.చిన్న లక్ష్మన్న, మోహన్‌బాబు, సచివాలయ కన్వీనర్ పి.ఫిరోజ్‌ఖాన్, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వృద్ధులకు కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ



పర్లలో మహిళకు బీపీ పరీక్ష చేస్తున్న వైద్యులు

ప్రజల ఆరోగ్యానికి రక్ష జగనన్న సురక్ష

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్షణ కలిస్తుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పర్ల–1 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిరన్వహించారు. సచివాలయం పరిధిలో 419 మందికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, గల్ల, కంటి మొదలగు పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమక్క, ఈఓఆర్డీ రవి కిషోర్, డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట వరం



పేదల ఆరోగ్యాల పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపుతున్న శ్రద్ధ చాలా మంచిది. ఆరోగ్య సురక్ష పేదల పాలిట వరంగా మారింది. నాకు షుగర్ లెవెల్స్ ఎక్కువగా వున్నాయని వైద్యుల వద్దకు వెళ్లితే రూ.వేలల్లో ఖర్చుపెట్టించారు. ఇక్కడే వైద్య పరీక్షలు చేయడంతో వ్యయ ప్రయాసాలు తగ్గాయి. మేము జగనన్నకు రుణపడి ఉంటాం. వైద్య సేవలు బాగున్నాయి.

–లక్ష్మిదేవి, శకునాల

వైద్య పరీక్షలు బాగున్నాయి...



నేను కొంత కాలం నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. కర్నూలుకు వెళ్లి చూపించుకుంటే ఖర్చు ఎక్కువ వస్తుంది. దీంతో ఎక్కడా చూపించకుండా ఆశ వదిలేశా. అయితే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగానే పరిష్కారం లభించింది. ప్రభుత్వం ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రజలు భాగుపడుతారు.

– కొట్టం తులశమ్మ, స్థానికురాలు

ఉచితంగా వైద్య పరీక్షలు



పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో సంతోషంగా ఉంది. నేను చాలారోజుల నుంచి నరాల నొప్పులతో బాధపడేదాన్ని. వైద్యుల వద్దకు వెళ్తే వేలకు వేలు ఖర్చు పెట్టించారు. కానీ నొప్పులు తగ్గలేదు. ప్రస్తుతం ఊర్లోనే వైద్య క్యాంపులు నిర్వహించి, ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం మంచి కార్యక్రమం. జగన్ పాలన మరికొంత కాలం కొనసాగాలి.

– మద్దెల శాంతమ్మ, స్థానికురాలు

హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన అధికారులు

సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను జిల్లా వైద్య, మండల అధికారులు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో డెంగ్యూ అనుమానిత కేసులపై రెండు రోజులుగా మండల, గ్రామ పంచాయతీ, వైద్య అధికారులు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 50 మందికి పైగా వైద్య సిబ్బంది జబ్బు అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖరరావు, సబ్ యూనిట్ అధికారి రంగాస్వామి, ఈఓఆర్డీ సందీప్, సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రసాదరెడ్డి, ఆదినారాయణ తదతరులు గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. అదేవిధంగా గ్రామంలోని వీధులలో లార్వ నియంత్రణకు మందును అధికారులు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ తబిత, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాజకీయ పార్టీల నాయకుతో ఆర్డీఓ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

కోడుమూరు రూరల్ : నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల రాజకీయ పార్టీల నాయకులతో కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ శుక్రవారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ జాబితాను రూపొందించారన్నారు. ఓటర్ల జాబితాను కూడా త్వరలో ప్రచురిస్తామన్నారు. జాబితా ప్రచురణ అనంతరం అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏవైనా అభ్యంతరాలుంటే సరి చేస్తామన్నారు. రాజకీయ పార్టీల నేతలు కూడా బూత్‌లెవల్ ఏజెంట్ల నియమించుకుని ఓటర్ జాబితాలను పరిశీలించుకోవాలని ఆర్డీఓ సూచించారు. సమావేశంలో కోడుమూరు, సి.బెళగల్ తహసీల్దార్లు జయన్న, శేషఫణి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీన్, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సీపీఐ నాయకుడు క్రిష్ణ, మాజీ జెడ్పీటీసీ ఎల్. వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలించిన ఆర్డీఓ

కోడుమూరు : ఆర్‌బీకే సిబ్బంది, వీఆర్వోలు రూపొందించిన ఖరీఫ్ పంట నమోదు రికార్డులను శుక్రవారం కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. శుక్రవారం మండలంలోని వెంకటగిరి గ్రామ పొలాలను తహసీల్దార్ జయన్న, ఏఓ రవిప్రకాష్‌తో కలిసి ఆర్డీఓ హరిప్రసాద్ సందర్శించారు. పంట నమోదు సక్రమంగా ఉందా లేదా, ఫీల్డ్‌లో రైతు ఏ పంట వేశాడు, నమోదు ఏ పంట చేశారు, రైతు వివరాలు సక్రమంగా ఉన్నాయా లేవా తదితర వివరాలపై ఆర్డీఓఆరా తీసీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

పంట నమోదు రైతులకు వరం

కల్లూరు: పంట నమోదు రైతులకు వరం అని కర్నూలు డివిజన్ అధికారి (ఆర్డీఓ) సి.హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో పంట నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్ చేసుకుని, ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. పంట నమోదు అయిన రైతులకే ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం, సున్నావడ్డీ, పంట కొనుగోలు వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రామాంజనేయులు, వీఏఏ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత జగనన్నదే

- మెగా జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

కోడుమూరు రూరల్ : దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఒకే సారి నాలుగున్నర లక్షలమంది నిరుద్యోగ యువతీ,యువకులకు గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డా.సుధాకర్ అన్నారు. శుక్రవారం కోడుమూరు జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించలేనిది ఏది లేదన్నారు. చదువు పూర్తయిన యువతీ, యువకులు పెడదారి పట్టకుండా వారికి అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ఉచితంగా అందించడంతో పాటు, జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహించి వారికి ఉద్యోగాలు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు తమ నైపుణ్యాలను పెంచుకుని ఇష్టమైన ఉద్యోగాలను సంపాదించుకుని కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇకనుంచి ప్రతి నెల కోడుమూరు నియోజకవర్గంలో జాబ్‌మేళా కార్యక్రమాలు నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. డీఎస్ డీఓ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు ఆదిత్య ఆర్గానిక్స్, జె గ్రూపు జోషిత ఇన్‌ఫ్రా, గ్రీన్ టెక్, బిగ్ బాస్కెట్, శ్రీరామ్ చిట్స్, నవభారత్ ఫర్టిలైజర్స్, అమెజాన్ వేర్ హౌస్, బీఎంసీ సెక్యూర్టి వంటి మొత్తం 13కంపెనీలకు సంబంధించి ప్రతినిధులు హాజరయ్యారన్నారు. మొత్తం 700కు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, యువతి,యువకులు తమకిష్టమైన జాబ్‌కు సంబంధించిన ఇంటర్వ్యూకు అటెండ్ అయి ఉద్యోగాలను పొంది ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక వైసీపీ నేతలు అద్దుగల రాజశేఖరరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ కర్ణ, అయ్యప్ప, ప్రతాప్‌రెడ్డి, జయన్న, ఆయా కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ,యువకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పుట్టాలమ్మ ఆలయానికి రోడ్డు నిర్మిస్తాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రతి గ్రామాన్ని పట్టణాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నెరవాడ గ్రామంలో గడపగడపకు–మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామానికి వచ్చి ఎమ్మెల్యేకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ ఎమ్మెల్యే స్వాగతించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివాలు బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెరవాడ ప్రజల కోరిక మేరకు జాతీయ రహదారి నుంచి పుట్టాలమ్మ ఆలయం వరకు రూ.2కోట్ల 75లక్షలతో బీటీ రోడ్డు వేసి తీరుతామని చెప్పారు. ఏళ్ల నాటి రోడ్డు సమస్యకు పరిష్కారం చూపామన్నారు. పంచాయతీశాఖ ద్వారా దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేరా బీటీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. వీటితో పాటు ఈ నాగులు సంవత్సరాల కాలంలో గ్రామంలో దాదాపుగా రూ. 50లక్షల మేరా సీసీ రోడ్లు, రూ.10లక్షల మేరా డ్రైనేజీ కాల్వలు వేసి ప్రజలకు సురక్షిత మంచినీరు అందిచేందుకు రూ.2లక్షలతో మినిరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజల సౌకర్యార్థం మరో రూ.30లక్షల రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

రైల్వే బ్రిడ్జి సమస్యను పరిష్కారం చూపాం

నెరవాడ గ్రామం ముందు ఉన్న రైల్వే బ్రిడ్జి సమస్యకు శాశ్విత పరిష్కారం చూపామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గుర్తు చేశారు. గతంలో రైల్వే బ్రిడ్జి కింద వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బంది ఉండడం, నిత్యం వరదనీరు, డ్రైనేజీ నీరు ప్రవహిస్తుతండంతో రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌తో సమావేశమై సమస్యను వివరించామన్నారు. స్పందించిన ఆయన బ్రిడ్జి కింద అండర్ డ్రైనేజీ వెళ్లేలా నిర్మాణంలో మార్పులు చేశారన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫూట్స్ పంటను పరిశీలించి సాగు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ లింగాల శారదమ్మ, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రమణారెడ్డి, జ్యోతిస్వరూప్‌రెడ్డి, విష్ణురెడ్డి, పాలం చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, రాజన్న, జాకీర్‌ఉసేన్, ఎల్లగౌడ్, సుబ్బరాయుడు, నాగిరెడ్డి, యల్ల క్రిష్ణయ్య తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ దస్తగిరి, సచివాలయ సిబ్బంది, వలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

గడివేముల: ప్రజాసాధికారత లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో శుక్రవారం మూడోరోజు గడప గడపకు మనప్రభుత్వం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలువివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్‌లు, ఇంటి పట్టాలు,రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్ల మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కాటసాని అధికారులతో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి అర్హత ఉంటే మంజూరు చేయిస్తానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్ చదివి లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్లలాంటివన్నారు. అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ రామస్వామి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏఈలు మూర్తి, భాస్కర్, పవన్, నంద్యాల వ్యవసాయ సంఘం అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, సయ్యద్ బాషా, అనిల్ కుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రమేష్,సర్వేశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ప్రజల ఆరోగ్యానికి భరోసా

పాణ్యం: ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కొండజుటూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను వారు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 421 మందికి వివిధ రకాల వ్యాధులకు డాక్టర్లు పరీక్షలు చేశారు. అదేవిధంగా అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, మండల కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, రచనారెడ్డి, బాబు, ఈశ్వర్‌గౌడ్, డాక్టర్లు గురుకుమార్, సునీల్‌బాబు, కావ్య, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హెల్త్ క్యాంప్

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం సి.బెళగల్ మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ హరిచంద్రుడు తెలిపారు. గ్రామంలోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో వైకేపీ సీసీ మృతి

సి.బెళగల్: మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథకం (వైకేపీ)లో క్లస్టర్ కోఆర్డీనేటర్ (సీసీ)గా విధులు నిర్వర్తిస్తున్న నాగేంద్ర (40) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. మిడ్తూరు మండలం పైపాల్యం గ్రామానికి చెందిన నాగేంద్ర 2012 సంవత్సరం నుంచి డీఆర్‌డీఏ పథకంలో వివిధ మండలాల్లో సీసీ విధులు నిర్వర్తించారు. 2020 నుంచి మండలంలో సీసీగా చేరిన ఆయన రెగ్యులర్ సీసీగా సి.బెళగల్, చింతమానుపల్లె, ఇన్‌చార్జ్‌గా సీసీగా తిమ్మందిడ్డి, సంగాల, పలుకుదొడ్డి గ్రామాలలో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం నాగేంద్రం తన విధులలో భాగంగా మండల కేంద్రం సి.బెళగల్‌లోని స్త్రీశక్తి భవనానికి చేరుకున్నాడు. 11:30 గంటల సమయంలో గుండెపోటుకు గురికావడంతో గమనించిన ఏపీఎం వెంకటస్వామి, సహచర సీసీలు వెంటనే స్థానికంగా ఉన్న 108 వాహనంలో కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేసినటప్పటికీ కోలుకోలేక సీసీ మృతి చెందారని ఏపీఎం తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక్క కుమార్తె, సంతానంగా ఉన్నారు. మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌నకు వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సీసీ నాగేంద్ర మృతి చెందిన విషయం తెలుసుకుని దిరాగ్భంతి వ్యక్తం చేశారు. మృతుడి ఆత్మ శాంతించాలని అధికారులు ఉద్యోగులతో కలిసి ఐదు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

ఎస్సార్బీసీకి నీటి విడుదల

పాణ్యం: ఎస్సార్బీసీ కాల్వలకు అధికారులు నీటిని విడుదల చేశారు. శుక్రవారం ఉదయం బైపాస్ కెనాల్ ద్వారా ఎస్సార్బీసీ కాల్వకు గోరుకల్లు వద్ద గేట్లను ఎత్తి వదిలారు. ఇటీవల జరిగిన నంద్యాల నీటిని కేటాయింపుల సమావేశంలో ప్రభుత్వ అధికారులు వార బంధీకి అంగీకరించారు. వారి ఆదేశాల మేరకు బనకచర్ల క్రాస్ రెగ్యూలేటర్ నుంచి ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేయడం జరిగింది. ప్రస్తుతం ఎస్సార్బీసీ కాల్వకు 1300క్యూసెక్కుల మేరా నీటిని దిగువకు వెళ్తున్నట్లు చెప్పారు. మరో పది రోజుల పాటు నీరు వస్తుందని అధికారులు పెర్కొన్నారు. ఎస్సార్బీసీ బ్లాక్‌ల ద్వారా పంటలకు నీటిని అందిస్తున్నామన్నారు.

